క్లుప్తంగా

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా నాగేశ్వరరావు



దాచేపల్లి: యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా జి.నాగేశ్వరరావు నియమితులయ్యారు. స్థానిక ఏలిఎంపేట ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న నాగేశ్వరరావును జిల్లా కమిటీ సమావేశంలో జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాగేశ్వరరావు నియామకం పట్ల పలువురు యూటీఎఫ్ నేతలు హర్షం వ్యక్తం చేశారు.

ఆడుదాం ఆంధ్రాకు దరఖాస్తు చేసుకోండి

ఎంపీడీవో ఫణికుమార్ నాయక్

గురజాల : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి క్రీడాకారుడికి గుర్తింపు ఇవ్వాలనే లక్ష్యంతో ఆడుదాం ఆంధ్రా అనే సరికొత్త కార్యక్రమాన్ని తీసుకురావడం జరిగిందని ఎంపీడీవో ఆర్.ఫణికుమార్ నాయక్ తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖో–ఖో , బ్యాడ్మింటన్ పోటీలకు ఆసక్తి కలిగిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. డిసెంబర్ 15వ తేదీ నుంచి గ్రామ వార్డు సచివాలయాల పరిధిలో పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులపై బహిరంగ ప్రజావేదిక

కారెంపూడి: గత ఏడాది మండలంలో జరిగిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్) పనులపై బహిరంగ ప్రజావేదిక కార్యక్రమం మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి జరుగుతుందని ఎంపీడీఓ జి.శ్రీనివాసరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల పరిధిలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో జరిగిన రూ.4.51 కోట్ల ఉపాధి హామీ పనులపై ప్రజావేదికలో సోషల్ ఆడిట్ బృందాలు నివేదించనున్నట్లు పేర్కొన్నారు. మండల ప్రజా ప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సంబంధిత శాఖల అధికారులు, ఉద్యోగులు హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

ప్రయోగాత్మకంగా పత్తి దిగుబడి సేకరణ



అచ్చంపేట: పత్తిపంటలో వచ్చే దిగుబడిని మండలంలోని కస్తల గ్రామానికి చెందిన భీమిరెడ్డి కృష్ణారెడ్డి భూమిలో వ్యవసాయశాఖ ఏవో పి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సోమవారం ప్రయోగాత్మకంగా సేకరించారు. వ్యవసాయశాఖ సూచనల మేరకు వేసిన 10 చదరపు మీటర్ల విస్తీర్ణం గల భూమిలో 16.170 కిలోల నాణ్యమైన పత్తి దిగుబడి వచ్చినట్లు నిరూపించారు. వ్యవసాయశాఖ ద్వారా ఆర్బీకేలలో వివరించే సూచనలు పాటించినట్లయితే అధిక దిగుబడులు సాధ్యపడతాయని ఏవో తెలిపారు. ఇదే విధంగా మిరప, వరి పంటలలో కూడా నమూనాలు తీయడం జరుగుతుందన్నారు. రసాయన ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలన్నారు. యాజమాన్య పద్ధతిలో వ్యవసాయం చేస్తే నాణ్యమైన అధిక దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు నాగశ్రీ, విస్తరణాధికారులు నాయక్, రైతులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



కారెంపూడి: వ్యవసాయ సూక్ష్మ పోషకాల ప్రముఖ తయారీ సంస్థ ఏరీస్ ఆగ్రో లిమిటెడ్ స్థాపించి 54 వసంతాలు పూర్తయిన సందర్భంగా స్థానిక అంకాలమ్మ గుడి సెంటర్‌లోని సాయిబాబా గుడి ఆవరణలో ఆ కంపెనీ అధికారులు పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. అలాగే దుర్గి మండలం ఆత్మకూరు గ్రామంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశామని ఆ కంపెనీ సీనియర్ మేనేజర్ జి.అమరయ్య తెలిపారు. ఏరీస్ కంపెనీ ఉద్యోగులు జి.రాజేష్, ఎస్.శ్రీనివాసరావు, డీలర్ పొట్టుమూర్తి పుల్లారావు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

భస్మాంగరాగాయ.. మహేశ్వరాయ..

- పరమేశ్వరుని నామస్మరణతో మార్మోగిన ఆలయాలు
- కార్తీక దీపాలతో వెల్లివిరిసిన భక్తి భావం

రెంటచింతల: కైలాసనాథుడైన శివయ్యకు ఎంతో ప్రీతికరమైన కార్తిక మాసం సోమవారం అతిపురాతన శైవక్షేత్రమైన గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి దేవస్థానం పరమేశ్వరుని నామస్మరణతో మార్మోగింది. దేవస్థానం సమీపంలోని పవిత్ర కృష్ణానది ఒడ్డున వేకువజాము నుంచే భక్తులు పుణ్యస్నానాలు చేసి కార్తిక దీపాలు వెలిగించి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాలలోని అనేక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అర్చకులు శివశర్మ నేతృత్వంలో స్వామివార్లకు భక్తిశ్రద్ధలతో పూజలు, అభిషేకాలు నిర్వహించి గణపతి, రుద్ర హోమాలలో పాల్గొన్నారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డి, వైస్ చైర్మన్ బాపనపల్లి శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. రెంటచింతల శివాలయంలో కార్తికమాసం పురస్కరించుకుని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి కార్తిక దీపాలను వెలిగించారు. మండలంలోని తుమృకోట గ్రామంలో వేంచేసిన పార్వతి రామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తికమాసం సందర్భంగా అర్చకులు మల్లిఖార్జున శర్మ నేతృత్వంలో స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

కారెంపూడి: కార్తిక సోమవారం కారెంపూడిలోని దేవాలయాలకు భక్తులు పోటెత్తారు. పల్నాటి వీర్ల అంకాలమ్మ తల్లి ఆలయం, చెన్నకేశవస్వామి దేవాలయం, సూరేశ్వరస్వామి దేవాలయాలకు భక్తులు భారీగా తరలివచ్చి కార్తిక దీపాలు వెలిగించారు. అలాగే వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయానికి కూడా మహిళలు భారీగా తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మండలంలోని అన్ని ఆలయాలు కార్తిక సోమవారం భక్తులతో నిండిపోయాయి. ఆలయాలు కార్తిక దీప కాంతులతో మెరిసిపోయాయి. కారెంపూడిలోని ఆలయాలకు సోమవారం సాయంత్రం భక్తులు భారీగా తరలివచ్చి కార్తిక దీపాలను వెలిగించారు. ఆలయాలన్నీ దీప కాంతులతో ధగధగలాడాయి.

వెల్దుర్తిలో ఘనంగా కార్తిక పౌర్ణమి..

వెల్దుర్తి: కార్తిక పౌర్ణమిని పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాలలో మహిళలు సోమవారం తెల్లవారుజామునే దేవాలయాలలో దీపాలు వెలిగించి పూజలు చేశారు. కార్తిక పౌర్ణమి సోమవారం రావటంతో మహిళలు అధిక సంఖ్యలో పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. కుటుంబ సమేతంగా చిన్న, పెద్ద అందరూ ఆలయాలకు పెద్ద ఎత్తున వచ్చారు. వివిధ శివాలయాల్లో భక్తులు దీపాలు వెలిగించి, స్వామి వారిని దర్శించుకొన్నారు. తెల్లవారుజాము 3 గంటల నుంచే ఆలయాల వద్ద దీపాలు వెలిగించారు. స్వామిని దర్శించుకొనేందుకు క్యూలైన్లలో బారులు తీరారు. స్వామిని దర్శించుకున్న భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు. పలు ఆలయాలలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

పిడుగురాళ్ల: పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులో వేంచేసియున్న నాగుల గుడి దేవస్థానంలో కార్తిక మాసం రెండవ సోమవారం, పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించటం జరిగింది. గంగా పార్వతి సమేత భవానీ శంకరస్వామి వారు అర్ధనారీశ్వర అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు విశేషంగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పట్టణంలోని సత్యసాయి మందిరంలో..

సోమవారం కార్తిక పౌర్ణమి సందర్భంగా శివలింగాకారంలో దీపాలు వెలిగించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు దంపతులు హాజరై దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను భక్తులు స్వీకరించారు.

ప్రత్యేక పూజలు, అభిషేకాలలో పాల్గొన్న భక్తులు

గురజాల : కార్తిక మాసం సందర్భంగా కార్తీక పౌర్ణమి రెండు రోజులు రావడంతో శైవక్షేత్రాలు సోమవారం కిటకిటలాడాయి. శైవక్షేత్రాలు భక్తుల శివనామస్మరణతో హోరెత్తాయి. భక్తులు తెల్లవారుజాము 4గంటల నుంచి కార్తిక స్నానమాచరించి స్వామివారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. స్థానిక శ్రీరాంపురం రోడ్డులో గంగా పార్వతీ సమేత ఇష్టకామేశ్వర స్వామి దేవాలయం, దైద రోడ్డులోని అమరలింగేశ్వరస్వామి, ముక్కంటేశ్వరస్వామి దేవాలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారి గణపతి సురేష్ తగు చర్యలు తీసుకున్నారు. డీఎస్పీ పల్లపురాజు ఆదేశాల మేరకు సీఐ బాలకృష్ణ ఆధ్వర్యంలో ఎస్ఐలు అశోక్‌బాబు, బి.అనంత కృష్ణ బందోబస్తు నిర్వహించారు.



అర్ధనారీశ్వర అలంకరణ గంగా పార్వతి సమేత భవానీ శంకర స్వామి



కార్తిక పౌర్ణమి మహోత్సవంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



భక్తులతో నిండిపోయిన సూరేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం



రెంటచింతల శివాలయంలో కార్తిక దీపాలను వెలిగిస్తున్న ఎంపీపీ దాసరి చౌడేశ్వరి కుటుంబ సభ్యులు



సత్రశాలలో ప్రత్యేక అలంకారంలో మల్లికార్జునస్వామివారు



శివలింగాకారానికి జ్యోతులు వెలిగిస్తున్న మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు



బిలంలో స్వామివారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

అభివృద్ధే మన నినాదం

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



భట్రుపాలెంలో పైపులైను నిర్మాణ పనుల శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి: అభివృద్ధి, సంక్షేమం మన నినాదమని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని భట్రుపాలెం గ్రామంలో ఆయన పర్యటించారు. రూ.75 లక్షల వ్యయంతో నిర్మించనున్న తాగునీటి పైపులైను నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం రూ.30 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్లు, రూ.17 లక్షలతో నిర్మించిన ముఖ ద్వారాన్ని ప్రారంభించారు. సభలో ఎమ్మెల్యే కాసు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన నాలుగున్నరేళ్లలో భట్రుపాలెం గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశామన్నారు. 80 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. మరో 90 మందికి ఇళ్లపట్టాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. గత ప్రభుత్వాల్లో అభివృద్ధికి ఆమడదూరంలో భట్రుపాలెం ఉందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో భట్రుపాలెంను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ప్రజలకు అండగా ఉన్నామన్నారు. గ్రామంలో అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలు గుర్తించాలని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అండగా ఉండాలని కోరారు. అనంతరం శ్రీలక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ కటకం జయశ్రీ, నగరపంచాయతీ చైర్మన్ కె.సాంబయ్య, సర్పంచ్ భూక్యా కొండానాయక్, ఎంపీటీసీ రెడ్యా నాయక్, ఉపసర్పంచ్ జగదీష్, పార్టీ మండల కన్వీనర్ తోట కృష్ణ, మాజీ సర్పంచ్ మందపాటి రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి గడపకూ జరిగిన మేలు వివరించాలి

ఎంపీపీ దాసరి చౌడేశ్వరి



పాలువాయిగేటు గ్రామంలో సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరిస్తున్న ఎంపీపీ చౌడేశ్వరి

పాలువాయిగేటు(రెంటచింతల): రాష్ట్ర ప్రజల శ్రేయస్సుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా గ్రామంలోని ప్రతి గడపకు జరిగిన మేలును లబ్ధిదారులకు వివరించాలని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా జగన్ మోహన్‌రెడ్డి అవసరం ఎందుకు అనే కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని పాలువాయి గేటు గ్రామంలోని మండల పార్టీ అధ్యక్షులు బ్రహ్మారెడ్డి, పార్టీ నాయకులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, గ్రామ వలంటీర్లతో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఒక్క పాలువాయి గేటు గ్రామంలోనే వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు రూ.4.5 కోట్లు నిధులు అందజేయడం జరిగిందన్నారు. ఆ నాటి పాలన..మన ప్రభుత్వ పాలన మధ్య వ్యత్యాసాన్ని ప్రజలకు వివరిస్తూ ఆపు బాబు నాటకం –జగనే మా నమ్మకం అంటూ గ్రామస్తులలో చైతన్యం తీసుకురావాలన్నారు. ముందుగా గ్రామంలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేసి, వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సర్పంచ్ చింతా సుబ్బారావు, మండల పార్టీ అధ్యక్షులు గొట్టం చిన్న బ్రహ్మారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ పమ్మి సీతారామి రెడ్డి, ఎంపీటీసీ లావు రత్నాకర్‌రావు, మాజీ ఎంపీటీసీ చౌడం రాజ్యలక్ష్మి, సొసైటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, పార్టీ నేతలు గొలమారి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ప్రారంభమైన వరికోతలు



నర్సింగపాడు కోత తర్వాత ధాన్యం కుప్పపోస్తున్న వరికోత యంత్రం

నకరికల్లు: మండలంలోని నర్సింగపాడు గ్రామంలో ఖరీఫ్ వరికోతలు ముమ్మరంగా ప్రారంభమయ్యాయి. వరిసాగులో అధిక దిగుబడులు, నాణ్యమైన పంటకు నర్సింగపాడు ప్రతీతి. బోర్లు, బావులు ఉండడం, అదనంగా సాగర్‌కెనాల్ ద్వారా నీటిలభ్యత గల గ్రామం కావడంతో వరి అధికంగా సాగు చేస్తారు. మండలంలో ముందస్తుగా నాట్లు వేస్తారు కాబట్టి కోతలు కూడా ముందుగా వస్తాయి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఏపీ 567, జేజీఎల్ 384, అంకూర్‌సోనమ్, బీపీటీ 5204 రకాలను రైతులు సాగు చేశారు. ఇటీవల పంటకోత ప్రయోగాలు చేసిన అధికారులు ఏపీ 567 రకం ఎకరాకు 32–33 బస్తాలు, అలాగే మిగిలిన రకాలు 40 బస్తాల వరకు దిగుబడులు వస్తున్నాయి. ధర కూడా 75కేజీల బస్తాకు రూ.2 వేల వరకు పలుకుతుంది. దీంతో రైతులు ఒకింత ఆనందంలో ఉన్నారు.

రేషన్ పంపిణీ సక్రమంగా చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్



రేషన్ వాహనాల నిర్వాహకులతో మాట్లాడుతున్న సీఎస్‌డీటీ మురళి, డిప్యూటీ తహసీల్దార్ ధనలక్ష్మి

కారెంపూడి: ఎండీయూ వాహనదారులు రేషన్ సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని, మిగిలిన సరుకుల నిల్వలను ప్రతి నెల 17వ తేదీలోపు రిటర్న్ చేయాలని తహసీల్దార్ జి.శ్రీనివాస్ ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం రేషన్ పంపిణీపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎండీయూ వాహనాల ద్వారా సంబంధిత ఎఫ్‌పీ షాపుల పరిధిలో వలంటీర్ల వారీగా లోకేషన్లను గుర్తిస్తూ సరుకులను పంపిణీ చేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం కింద ఇచ్చే రేషన్‌ను పాఠశాలకు వెళ్లి అందించాలని, అలాగే ఐసీడీఎస్ కేంద్రాలకు కూడా పంపిణీ చేయాలని ఆదేశించారు. బియ్యం ఉచితంగా అందించాలని, కందిపప్పు రూ.67కు అర కిలో పంచదార రూ.17కు, కిలో గోధుమపిండి రూ.16కు పంపిణీ చేయాలని ఎక్కువ రేట్లు వసూలు చేయవద్దని హెచ్చరించారు. ప్రతి నెల 25వ తేదీలోపు డీలర్లు స్టాకు పొందడానికి డీడీలు తీయాలని డీలర్లను ఆదేశించారు. ఎండీయూ ఆపరేటర్లు 17వ తేదీలోపు రేషన్ పంపిణీ పూర్తి చేసి మిగిలి ఉన్న సరుకు నిల్వలను తిరిగి ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో డీటీ, సీఎస్ డీటీ, వీఆర్వోలు, డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు పాల్గొన్నారు.

రేషన్ వాహనాల రూట్ మ్యాప్ ముందస్తుగా ఇవ్వాలి

పిడుగురాళ్ల: రేషన్ వాహనాల రూట్ మ్యాప్‌ను ముందస్తుగా ఇవ్వాలని సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ మురళి తెలిపారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం రేషన్ వాహనదారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జాయింట్ కలెక్టర్ ఆదేశాలతో రేషన్ వాహన దారులందరు 1వ తేదీ నుంచి 17వ తేదీ వరకు రేషన్ సరఫరా చేయాల్సి ఉంది. ప్రతి రేషన్ వాహనదారుడు వారి పరిధిలో ముందస్తుగానే రూట్ మ్యాప్ సిద్ధం చేసి తమకు అందజేయాలని, దానిని జిల్లా కార్యాలయానికి పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ధనలక్ష్మి, వీఆర్వోలు, రేషన్ వాహనాల అసోసియేషన్ అధ్యక్షులు బంకా మాణిక్యరావు, రేషన్ వాహదారులు ఉన్నారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీలు

రూ.11,58,627 విలువైన ఎరువులు, పురుగమందులు సీజ్



పశర్లపాడులోని పురుగుమందుల షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

రెంటచింతల: మండలంలోని పశర్లపాడు గ్రామంలో ఎరువులు, పురుగుమందుల షాపులలో విజిలెన్స్ అధికారులు సోమవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. గ్రామంలోని రెండు దుకాణాలలో సరైన రికార్డులు లేకుండా, బయో, పురుగు మందులు, ఎరువులు విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ గుంటూరు అధికారులు స్థానిక మండల వ్యవసాయ అధికారితో కలిసి తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలలో ఎటువంటి నకిలీ పురుగుమందులు గుర్తించలేదని విజిలెన్స్ ఏవో కె. రమణకుమార్, ఎస్ఐ ఎం.రామచంద్రారెడ్డి తెలిపారు. జీ2 లేకుండా పురుగుమందులు, ఎరువులు, పురుగుమందులకు ప్రిన్సిపల్ సర్టిఫికెట్లు, ఎరువులకు ఫారం ఓఎస్ లేకుండా విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు. రూ.5,02,968 విలువైన పురుగుమందులు, రూ.4,82,759 బయోమందుతు, రూ.1,72,900 ఎరువులు మొత్తం రూ.11,58,627 విలువైన ఎరువులు, పురుగమందులను సీజ్ చేసినట్లు వెల్లడించారు. ఈ తనిఖీలలో రెంటచింతల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

వృద్ధురాలికి నిత్యావసరాల పంపిణీ

వినుకొండ(నూజెండ్ల): స్థానిక తిమ్మాయపాలెం రోడ్డులో నివసిస్తున్న నిరుపేద వృద్ధురాలు పందిరి లక్ష్మికి సంకల్ప సేవాసమితి సహకారంతో పట్టణానికి చెందిన సయ్యద్ కరిమూన్ ఆధ్వర్యంలో రెండు నెలలకు సరిపడా బియ్యం, నిత్యావసర వస్తువులు, కూరగాయలు వితరణ చేశారు. కార్యక్రమం లో సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.